అందని ధాన్యం నగదు

- ముంచుకొస్తున్న వానాకాలం సాగు
- నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులు
- చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు



తొండ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఆరుగాలం కష్టపడి అకాల వర్షాలు దాటుకుని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులు నగదు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. రోజుల తరబడి తూకం లేక.. ఎగుమతికి లారీలూ రాక.. తరుగు కోతతో ఇబ్బందులు పడి ఎట్టకేలకు ధాన్యం విక్రయించిన రైతులకు నెలరోజులు గడుస్తున్నా ఖాతాల్లో నగదు జమ కాని పరిస్థితి. మరోవైపు వర్షాకాలం సీజన్ ప్రారంభంకావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని చదును చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడే లోపే విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునేందుకు ఎదురుచూస్తున్నారు. యాసంగి ధాన్యం అమ్మిన నగదు వస్తే పెట్టుబడికి ఇబ్బంది ఉండదని రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పినా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన రైతులు డబ్బులు రాక ఆందోళన చెందుతున్నారు. యాసంగి సాగుకు అప్పులు చెల్లించేదెలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18కేంద్రాల్లో కొనుగోళ్లు..

తిరుమలగిరి మండలంలో 11ఐకేపీ, 4పీఏసీఎస్, 2 మెప్మా, 1 రైతు సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాలలో 1.12లక్షల బస్తాలను కొనుగోలు చేశారు. కొనుగోళ్లలో కూడా నెలల కొద్ది జాప్యం జరిగింది. కొనుగోళ్లు పూర్తయి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతులకు డబ్బులు వేయక పోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

చెల్లింపుల్లో ఆలస్యం..

ఓ వైపు నెల రోజుల ముందుగానే వానాకాలం సీజన్ ప్రారంభించాలని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం యాసంగి ధాన్యం డబ్బులు చెల్లించకపోవడంతో రైతు వద్ద పెట్టుబడికి డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. మండలంలో 507 మంది రైతులకు ఇంకా రూ.8కోట్లకు పైగా నగదు రావాల్సి ఉందని సమాచారం. సకాలంలో ధాన్యాన్ని విక్రయించగలిగి డబ్బులు చేతికి అందితేనే ప్రైవేట్ అప్పులను చెల్లించడం, వరికోత మిషన్ల అద్దెలను చెల్లించడం, బ్యాంకుల్లో రుణాలను పునఃరుద్ధరించుకోవడంతో పాటు వానాకాలం పెట్టుబడులకు వెచ్చించే వీలుంటుంది. కాని ఆలస్యం అవుతుండటంతో వానాకాలం సాగుకు ఇబ్బందులే అని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన ధాన్యం డబ్బులు ఖాతాల్లో వేయించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ధాన్యం అమ్మి 26రోజులయ్యింది



గత నెల 15వతేదీన 203బస్తాల ధాన్యాన్ని అమ్మాను. ఇప్పటి వరకు డబ్బులు అకౌంట్‌లో పడలేదు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర చెల్లింపులకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాను. పత్తి గింజలు, ఎరువులు కొనడానికి డబ్బులు లేవు.

– వాలియా, రైతు

వెంటనే నగదు జమచేయాలి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి 20రోజులు గడిచినా డబ్బులు జమ కాలేదు. పెట్టుబడులకు చేసిన అప్పులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నాను. అధికారులు స్పందించి డబ్బులు వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయించాలి.

– వెంకన్న, తొండ గ్రామం

క్లుప్తంగా

సేవలు అభినందనీయం



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : సుమన్ యువసేన సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2కె రన్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి సుమన్ యువసేన ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో సుమన్ యువసేన అధ్యక్షుడు గుండా వెంకన్న, తోట శ్యామ్‌ప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దామోదర్

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో ప్రతిభ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన టెక్నో డీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ రూ.1.20లక్షల విరాళాన్ని సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన దామోదర్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ నిర్వాహకులు, ప్రతిభ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



బొడ్రాయికి పూజలు చేస్తున్న సురేష్‌రావు

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెదగారకుంట తండాలో బొడ్రాయి ప్రతిష్ఠ 4వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలతో భక్తిభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో భూక్య శివనాయక్, శ్రీను, సైదులు, వెంకన్న, నర్సింహ, నాగు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మనోహర మృతికి సంతాపం



మనోహర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

తుంగతుర్తి : మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కేతిరెడ్డి గోపాల్‌రెడ్డి మాతృమూర్తి కేతిరెడ్డి మనోహర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సోమవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య తదితరులు ఉన్నారు.

సారా విక్రయదారుల బైండోవర్



తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ అవుతున్న సారా విక్రయదారులు

మద్దిరాల : మండలంలోని చిన్ననెమిల గ్రామానికి చెందిన దెబ్బెటి పుల్లయ్య, చిన్ననెమిలా అవాసమైన సామేల్ తండాకు చెందిన గుగులోతు జానకి సారా విక్రయిస్తుండడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఇబ్రహీం సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారిని బైండోవర్ చేసుకోని మరోసారి ఇలా చేస్తే రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.

ఆక్రమణకు గురైన భూమిని ఇప్పించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఆక్రమణదారుల నుంచి తమ భూమిని ఇప్పించి న్యాయం చేయాలని తుంగతుర్తి మండలం వెలుగుపల్లి అన్నారం గ్రామానికి చెందిన అన్నెపర్తి వెంకటరత్నం, అన్నెపర్తి శ్రీనివాస్ అధికారులను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. వెలుగుపల్లి అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 775, 776లో తమ తండ్రి అన్నెపర్తి భిక్షం పేరుమీద ఉన్న 4ఎకరాల 20 గుంటల భూమి స్వాతంత్ర్య సమరయోధుడిగా ఉన్న సమయంలో ప్రభుత్వం గ్రామ పెద్దల సమక్షంలో కేటాయించిందని, అనంతరం కొన్ని సంవత్సరాలుగా ఆ భూమిని సేద్యం చేసుకున్నామన్నారు. కాగా అదే గ్రామానికి చెందిన అప్పట్లో గ్రామరెవెన్యూ అధికారిగా ఉన్న కొడకండ్ల కృష్ణారెడ్డి, అన్నెపర్తి భిక్షం, కుమారులైన అన్నెపర్తి వీరయ్య, అన్నెపర్తి వెంకటరత్నం పేరుమీదుగా మారుస్తానని నమ్మించి మోసం చేసిన కృష్ణారెడ్డి తన కుమారులైన కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలపై కొన్ని సంవత్సరాల క్రితం అక్రమంగా భూమిని పట్టా చేయించాడని వాపోయారు. ఈ ఆక్రమణకు సంబంధించి రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మా భూమి మాకు దక్కేలా న్యాయం చేయాలని వారు కోరారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



ఆలయంలో గణపతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వార్ల దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గ్రామ తోరణం, ఆలయంలో గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ హోమం నిర్వహించారు. అలాగే గ్రామంలోని దాతల ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం సుజాత యాదగిరి, ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

చిలుకూరు : చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో గల శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



నూతనకల్ : హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవి



పెన్‌పహాడ్ : హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

తుంగతుర్తి : ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండలంలోని పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను హెచ్ఎంలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ నకిరేకంటి రవి సోమవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పుస్తకాలను సరఫరా చేసిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీల, కేజీబీవీ ఎస్‌ఓ ఆసీయా జబీన్, బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ మల్లయ్య, హెచ్‌ఎం మైలారపు వెంకన్న, సీఆర్పీలు మామిడి సైదయ్య, నాగు, వహిద్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ నకిరేకంటి రవి సోమవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠ్యపుస్తకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పుస్తకాలను సరఫరా చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ

అర్వపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు సోమవారం ఎంఆర్‌సీకి చేరాయి. మండలంలో 33 పాఠశాలలకు గాను 21,067 పాఠ్యపుస్తకాలు అవసరముండగా మొదటి విడతలో 10,472 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. పుస్తకాలను నేటి నుంచి పాఠశాలల వారీగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



తుంగతుర్తిలో జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నియోజకవర్గ కేంద్రంలో 2కే రన్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నాడు కక్ష్యలు కార్పన్యాల నుంచి నేడు ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందు నియోజకవర్గంలో ఘర్షణలు, హత్యలతో అనేక కేసులు నమోదు అయ్యాయని, నేడు రాజకీయ కక్షలకు తావులేకుండా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా దిశానిర్దేశం చేస్తూ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. గోదావరి జలాలతో నియోజకవర్గంలోని బీడు భూములు సస్య శ్యామలంగా మారాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తుంగతుర్తి నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. అనంతరం నిర్వహించిన 2కే రన్‌లో వందలాది యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, సీఐ నాగార్జున గౌడ్, ఎస్ఐ డానియల్‌కుమార్, గుజ్జ యుగేందర్ రావు, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, గుండగాని రాములుగౌడ్, పులుసు యాదగిరి, కటకం వెంకటేశ్వర్లు, పరమేష్, నల్లు రామచంద్రారెడ్డి, ఆయా మండలాల ఎస్ఐలు, ఎంపీపీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గాజులగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో నిర్వహించే పండుగలతో ప్రజల్లో ఐక్యమత్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, రాములు, సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుటుంబానికి పరామర్శ

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ ఆవుల సతీష్ తండ్రి ఆవుల అవిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సోమవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, నాయకులు మామిడి మల్లయ్య, శేఖర్‌రెడ్డి, మహేష్, జంపాల రాజు, లాజర్ నాయకులు తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఆత్మకూర్ (ఎస్) : వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని పలు గ్రామాల్లో బడి ఈడు పిల్లలు బడులకు వెళ్లకుండా పనులు చేస్తున్నారని, వారందరినీ గుర్తించి ప్రతిఒక్కరూ బడిలో చేరేలా చూడాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ వి.లలిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.సైదులు, రాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విద్యార్థులు అంతంతే హాజరు..

అర్వపల్లి : పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సోమవారం తొలి రోజు మండలంలోని 33 పాఠశాలలకు కేవలం 150 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఆయా పాఠశాలల్లో 2500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే తొలిరోజు కావడం, మంచి రోజు కాదనే నమ్మకంతో తల్లిదండ్రులు పాఠశాలలకు తమ పిల్లలను పంపించడానికి ఇష్టపడలేదు. కాగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేశారు.

మోగిన బడిగంట

నాగారం : వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని 14 గ్రామపంచాయతీలలో గల 18ప్రాథమిక పాఠశాలలు, 06 జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, 01 మోడల్ స్కూల్, 01 ప్రాథమికోన్నత పాఠశాలలు తెరుచుకున్నాయి.

వైద్యసేవలు నిర్వహించడం అభినందనీయం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

తుంగతుర్తి : గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యాభారతి ఉన్నత పాఠశాలలో కృష్ణవేణి ఫౌండేషన్, అపోలోస్పెక్ట్రల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అందరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో కృష్ణవేణి ఫౌండేషన్ ముందుకు రావడం హర్షనీయమన్నారు. అనంతరం మెగా వైద్యశిబిరంలో 200మందికి ఉచితంగా గుండె పరీక్షలు, బీపీ, షుగర్, తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సూరారపు కృష్ణవేణి, సీఐ నాగర్జునగౌడ్, ఎస్ఐ దానియేల్‌కుమార్, ఇండియన్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, డాక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

మునగాల : మండలంలోని రేపాల గ్రామంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి సోమవారం దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ధర్నాలు చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తున్న వికలాంగుల సంఘాలను అణగదొక్కాలని సీఎం కేసీఆర్ దివ్యాంగుల పింఛన్‌ను కేవలం రూ.4016లు చేశారని అన్నారు. దళితబంధు మాదిరిగా వికలాంగుల బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రూ.ఆరువేల పింఛన్ అమలు చేసేంతవరకు పోరాడడానికి తమ సంఘం సిద్ధంగా ఉందన్నారు. వికలాంగుల శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

నూతనకల్ : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం డబ్బులను వెంటనే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గంటల్లో బ్యాంకు ఖాతాల్లో ధాన్యం నగదు జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అధికారులు స్పందించి ధాన్యానికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నాగమల్లు, రవి, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 13న జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో నిర్వహించే మహిళా సంక్షేమ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మహిళా, శిశు, వయోవృద్ధుల, వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా పీడీ జ్యోతిపద్మ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొంటారని అన్నారు. సూర్యాపేట పట్టణంలోని మహిళా ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, గృహిణులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని అన్నారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు సూర్యాపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ కిరణ్మయి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

విద్యా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన విద్యా వలంటీర్లను రెన్యూవల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని విద్యా వలంటీర్ల సంఘం మండల నాయకుడు మల్లేపాక యాకయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వలంటీర్లు రాచూరి వసంత, పేరం మల్లీశ్వరి, బుచ్చిమల్లు, అవిలయ్య, లింగయ్య, గంధార్, వినోద, లక్ష్మణ్, శేఖర్, సైదులు, వీరేష్ ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెన్‌పహాడ్ : ప్రమాదవశాత్తు మూడు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల పరిధి లోని అనంతారం గ్రామశివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెమ్మాది వెంకటేశ్వర్లు, మామిడి చిన్ని, వల్లభనేని సైదులు తమ ఖాళీ స్థలాల్లో గడ్డివాములను నిల్వచేసుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడాన్ని గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే గడ్డివాములు ఖాళీ బూడిదయ్యాయి. సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు లేదా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారని, కానీ తొమ్మిది సంవత్సరాల కాలంలో అర్హులైన ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదన్నారు. ఇకనైనా అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం లేదా 126 గజాల ఇంటి స్థలం కేటాయించి దాని నిర్మాణానికి రూ.10లక్షల సాయం అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, పార్టీ జిల్లా నాయకులు నాగన్న, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి రామోజీ, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.గులాం, నాయకులు వాజిద్, సింహాద్రి, నవీన్, రాధ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించాలి



తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

నూతనకల్ : మండలంలోని దిర్శనపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని ఆ గ్రామస్తులు అధికారులను సోమవారం కోరారు. గ్రామంలో బుక్కెడు నీటి కోసం వ్యవసాయ బావులను ఆశ్రయించి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని, వారం రోజుల నుంచి గ్రామంలో తాగునీటి సరఫరా జరగకపోవడంతో అల్లాడుతున్నారని వాపోయారు. గ్రామపంచాయతీకి సంబంధించిన బోరు మోటార్లను మరమ్మతులు చేసి వెంటనే తాగునీటిని అందించి సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన గిరిజనులు అధికారులను కోరారు.

కులవృత్తులకు రూ.10లక్షలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రభు

తిరుమలగిరి (తుంగతుర్తి) : కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారందరికీ తెలంగాణ ప్రభుత్వం రూ.10లక్షల ఆర్థికసాయాన్ని అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 14 కులవృత్తులకు కాకుండా 136 కులవృత్తుల వారికి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. బీసీ పలు కులాలకు రూ.లక్ష సాయం అందించేందుకు దరఖాస్తు చివరి తేదీని జూలై 20వరకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వంగరి బ్రహ్మం, అంబదాస్, శేఖర్, రవి, సోమకృష్ణ, తరుణ్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలోని శ్రీ కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సురమాంబ కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు